సాక్షి రంగారెడ్డి
మంగళవారం ; 26 ; డిసెంబర్ ; 2023



గంధం చెట్ల నరికివేత

యాచారం మండలం గడ్డమల్లయ్యగూడలో రైతులు పెంచుతున్న గంధం చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి ఎత్తుకెళ్లారు. 8లో▸



కొత్తూరు: చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

క్రిస్మస్ శోభ

క్రిస్మస్ వేడుకలను సోమవారం జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు ఘనంగా జరుపుకొన్నారు. ఆయా చర్చిలు ఏసు నామస్మరణతో మార్మోగాయి. భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు దైవ సందేశం వినిపించారు. చిన్నారులు, యువతులు నృత్యాలతో అలరించారు.

న్యూస్‌రీల్

వాజ్‌పేయికి ఘన నివాళి



రక్తదానం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరులు

కందుకూరు: ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని కందుకూరు లయన్స్‌క్లబ్, బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో అవసరమైన రక్తం దొరక్క రోగులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇలాంటి రక్తదాన శిబిరాలు విరివిగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు పైబడి, 45 కిలోల బరువున్న ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతున్న వారందరూ రక్తదానానికి అర్హులన్నారు. కార్యక్రమంలో పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి ఎల్మటి దేవేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, సర్పంచ్ సాధ మల్లారెడ్డి, నాయకులు కొంతం జంగారెడ్డి, ఎస్.భూమిరెడ్డి, దయాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్, శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, మాజీ అధ్యక్షులు తాళ్ల అంజయ్య, ఎస్.వెంకట్‌రంగారెడ్డి, కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, కోశాధికారి జి.రామస్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

28న కొంగరకలాన్‌కు అమిత్‌షా



సమావేశంలో పాల్గొన్న నేతలు

ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్‌లో ఈ నెల 28న జరిగే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం కొంగరకలాన్‌లోని శ్లోకా కన్వెన్షన్ హాల్‌లో జిల్లా ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొక్క నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. అమిత్‌షా సభకు పార్టీ నుంచి ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన ఎమ్మెల్యేలు, ఓడిపోయిన అభ్యర్థులు పాల్గొంటారని చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల వ్యూహంపై సమావేశం ఉంటుందన్నారు. ఈ మేరకు ఏర్పాట్లను పరిశీలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పోరెడ్డి నర్సింహారెడ్డి, అంజన్‌కుమార్‌గౌడ్, అశోక్‌గౌడ్, అందెల శ్రీరాములు, పాపయ్యగౌడ్, పొట్టి రాములు, దయానంద్‌గౌడ్, సుధాకర్‌శర్మ, బోసుపల్లి ప్రతాప్, లక్ష్మీపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు



రైతులతో మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్

ఆమనగల్లు: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని జిల్లా పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన్ రఘునందన్ సూచించారు. ఆమనగల్లు పట్టణం నుంచి తలకొండపల్లి రోడ్డులో వరిధాన్యం ఆరబోసిన రైతులతో సోమవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తాత బాగున్నారా.. ఎన్ని ఎకరాల్లో వరి వేశారు.. ఎంత దిగుబడి వచ్చింది అంటూ రైతులతో ఆప్యాయంగా మాట్లాడారు. రైతులు సాగుచేసిన పంటలు, దిగుబడి వివరాలను తెలుసుకుని వారికి పలు సూచనలు చేశారు. వరిధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని ఆయన సూచించారు. ధాన్యం సేకరణ కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని మోసం చేసే దళారులను గుర్తించి చర్యలు తీసుకుంటామని డీటీ హెచ్చరించారు.



కళాకారుల నృత్య ప్రదర్శన

శ్వాసమీద ధ్యాసే ధ్యానం

ధ్యానంతో జ్ఞాన జ్యోతిని వెలిగించుకోవాలి

- పీఎస్ఎస్ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి
- ఐదోరోజుకు చేరిన ధ్యాన మహాయాగాలు
- పెద్ద సంఖ్యలో హాజరైన ధ్యానులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

కడ్తాల్: శ్వాసమీద ధ్యాసే ధ్యానమని.. ధ్యానం ద్వారా తమ జీవితాల్లో జ్ఞాన జ్యోతిని వెలిగించుకోవాలని, పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి అన్నారు. మహేశ్వర మహాపిరమిడ్ ధ్యాన కేంద్రంలో పత్రీజీ ధ్యాన మహాయాగం సోమవారానికి ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ధ్యానులను ఉద్దేశించి పరిమళ పత్రి సందేశమిచ్చారు. ధ్యానంలోని రకాలు, విశిష్టతను ధ్యానులకు వివరించారు. సంకల్పానికి ధ్యానం తోడైతే అద్భుతాలు సృష్టించవచ్చని, ప్రతి ధ్యాని, ప్రతి పిరమిడ్‌మాస్టర్ ధ్యాన జగత్తుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ధ్యానానికి కులమత బేధం లేదు..

మానవాళికి పత్రీజీ చేసిన మహోపకారం శ్వాసమీద ధ్యాస అని ప్రముఖ నటుడు, సినీ గేయ రచయిత తనికెళ్ల భరణి అన్నారు. ధ్యాన వేడుకలకు హాజరైన ఆయన ధ్యాన గురువు బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీతో తనకున్న సాన్నిహిత్యాన్ని ధ్యానులతో పంచుకున్నారు. 30 ఏళ్ల క్రితం పత్రిజీ నాటిన విత్తనం నేడు ప్రపంచవ్యాప్తంగా వటవృక్షంలా విస్తరించిందని పేర్కొన్నారు. ధ్యానానికి కులమత బేధం లేదన్నారు. అనంతరం 'నాలోన శివుడు గలడు, నీలోన శివుడు గలడు'.. 'ఆట గదరా.. ఆటగద కేశవ' అంటూ ఆధ్యాత్మిక గీతాలతో తన్మయత్వంలో ముంచెత్తారు. కోల్‌కతా కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కళా ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. గీతామాధురి తన గీతాలాపనతో ఆకట్టుకున్నారు. వరుస సెలవులు రావడంతో పెద్ద సంఖ్యలో ధ్యానులు పిరమిడ్ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో మైహోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వరరావు, పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ధ్యాన గురువు పరిణీత పత్రి, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



పక్కగా 'ప్రజా పాలన'

- ఈ మేరకు ప్రణాళికలు రూపొందించండి
- ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రానీయొద్దు
- కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన గౌతం పొట్రు
- వెంటనే జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం నిరుపేదల ఆర్థిక ప్రగతి పెంచేందుకు చేపట్టిన బృహత్తర ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పక్కా ప్రణాళిక రూపొందించాలని కొత్త కలెక్టర్ గౌతం పొట్రు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు కలెక్టర్‌గా ఉన్న భారతిహోళికేరిని ప్రభుత్వం ఆదివారం బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు గౌతం పొట్రు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, డీఆర్‌ఓ సంగీత ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన కలెక్టరేట్‌లో ప్రజాపాలన కార్యక్రమం అమలుకు రూపొందించాల్సిన ప్రణాళికపై జిల్లా అధికారులతో సమీక్షించారు.

వందకు ఒక కౌంటర్

ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు చేపట్టనున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజల చెంతకు తీసుకెళ్లాలని సూచించారు. ముందు వెయ్యిలోపు జనాభా ఉన్న గ్రామాలను తీసుకోవాలని, ప్రతి కుటుంబానికి ఒక దరఖాస్తు అందేలా చేయాలన్నారు. ఇలా రోజుకు రెండు గ్రామాల చొప్పున ప్రతి పంచాయతీలో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఎంపీఓలు, ఎంఈఓలు డిప్యూటీ తహసీల్దార్లు బృందాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను స్వీకరించేందుకు ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్ చొప్పున ఐదు కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. 28, 29 తేదీల్లో చిన్న పంచాయతీలు, 30వ తేదీ నుంచి పెద్ద గ్రామ పంచాయతీలను ప్రణాళికలోకి తీసుకోవాలన్నారు.

దరఖాస్తులను ప్రజలకు అందజేయాలి

దరఖాస్తులను ప్రభుత్వమే ప్రజలకు అందజేస్తుందని చెప్పారు. ముందు రోజే అందజేయడం ద్వారా వాటిలో వివరాలను నింపడం సులభమవుతుందని చెప్పారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, చేయూత పథకాలకు అర్హులైన వాళ్లు అర్జీలు ఇవ్వాలని సూచించారు. ప్రజా పాలనపై ప్రతి గ్రామంలో, మున్సిపల్ వార్డుల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని కలెక్టర్ అధికా రులను ఆదేశించారు. అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతం పొట్రు



అయోధ్య అక్షింతలను చేవెళ్ల సర్పంచ్‌కు అందిస్తున్న భాస్కరయోగి

సంప్రదాయాలను గౌరవించాలి

జాతీయ సాహిత్య పరిషత్ సంఘటన కార్యదర్శి డాక్టర్ భాస్కరయోగి

చేవెళ్ల: మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించేలా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని జాతీయ సాహిత్య పరిషత్ సంఘటన కార్యదర్శి డాక్టర్ భాస్కరయోగి సూచించారు. దేశ ప్రజల ఎన్నో ఏళ్ల కల అయోధ్యలోని శ్రీరామజన్మభూమిలో భవ్యమైన రామ మందిరం నిర్మాణం కల నెరవేరుతోందని అన్నారు. మండలకేంద్రంలోని సీహెచ్ఆర్ గార్డెన్‌లో సోమవారం శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామాలకు అయోధ్య అక్షింతల వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయోధ్యలో జనవరి 22న బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా దేశంలోని ప్రతి ఇంటికీ అయోధ్య శ్రీరామక్షేత్ర ట్రస్ట్ అక్షింతలను పంపిణీ చేసిందన్నారు. జనవరి 15వ తేదీ వరకు ప్రతి ఇంటికీ వీటిని అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ అయిన తరువాత ఈ అక్షింతలు ప్రజలు వారి తలపై వేసుకోవాలని, శుభకార్యాలకు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు.

కోవిడ్ భయం.. జోష్ మాయం

- న్యూ ఇయర్ వేడుకలకు దూరం!

సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా కోవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. నగరంలోనూ ఆ ప్రభావం కనిపిస్తోంది. ఓ వైపు నూతన సంవత్సర వేడుకలకు సిద్ధమవుతున్న వేళ.. మరోవైపు తరుముకొస్తున్న మహమ్మారి అటు నగర వాసులతో పాటు న్యూ ఇయర్ ఈవెంట్ల నిర్వాహకులనూ ఆందోళనకు గురి చేస్తోంది.

వేడుకలు.. వ్యాప్తికి వేదికలు..

న్యూ ఇయర్ వేడుకలు ఏటా అట్టహాసంగా జరుగుతాయి. గ్రేటర్ పరిధిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో కలిపి అధికారికంగా అనుమతి పొందినవే ఏటా దాదాపు 7వేల ఈవెంట్లు ఉంటాయి. వీటిలో అత్యధికం పబ్స్, క్లబ్స్, ఫంక్షన్ హాళ్లు, బార్లు, లాంజ్‌లు, రిసార్ట్స్, కాఫీ షాప్‌లు ఉంటాయి. ఇవన్నీ పెద్దగా వెంటిలేషన్ లేని ఎయిర్ కండిషన్డ్ వాతావరణంలో జరిగే కార్యక్రమాలు కావడంతో సాధారణ ప్లు నుంచి కోవిడ్ వంటి వ్యాధుల వ్యాప్తికి అవకాశాలు ఎక్కువ. దీన్ని దృష్టిలో ఉంచుకునే గతంలో అమలు చేసిన మాస్కులు, శానిటైజేషన్ వంటి నిబంధనలు ఇప్పటికే తప్పనిసరి చేశారు. సోషల్ డిస్టెన్స్ లాంటి నిబంధనలు విధించినా అవి పాటించడం కష్ట సాధ్యమే.

అన్ని నగరాల్లోనూ అలర్ట్

దేశవ్యాప్తంగా ప్రస్తుతం కోవిడ్ యాక్టివ్ కేసుల సంఖ్య వేలల్లోకి చేరింది. దీంతో కేంద్రం పలు రాష్ట్ర ప్రభుత్వాల్ని అప్రమత్తం చేసింది. అందులో కేరళ, కర్ణాటకతో పాటు తెలంగాణ కూడా ఉంది. కొచ్చి, బెంగళూర్, ముంబై, ఢిల్లీ వంటి నగరాల్లో ఇప్పటికే న్యూ ఇయర్ వేడుకలపై కోవిడ్ ప్రభావం పడింది. అక్కడి ప్రభుత్వాలు వేడుకలపై పలు రకాల ఆంక్షల్ని విధించాయి. దీంతో మన నగరంలోనూ ప్రభుత్వం, అధికారులు న్యూ ఇయర్ వేడుకల కోసం ప్రత్యేకంగా కోవిడ్ ప్రొటోకాల్‌ను సిద్ధం చేసే అవకాశం కనిపిస్తోంది. నగరంలో వేగంగా కాకపోయినా స్థిరంగా కోవిడ్ కేసుల్లో పెరుగుదల కనిపిస్తోంది.

కార్డే కల్పతరువు!

గ్రేటర్ పరిధిలో రేషన్ కార్డులు ఇలా..

జిల్లా	పదేళ్ల క్రితం	ప్రస్తుతం
హైదరాబాద్	6,91,618	6,39,609
ఉమ్మడి రంగారెడ్డి	10,07,354	10,82,382

రేషన్ కార్డు ఉంటేనే అభయ హస్తం!

- ఆరు గ్యారంటీల్లో ఐదింటికి వర్తింపు
- రేషన్ కార్డులున్నది 60% కుటుంబాలకే
- పదేళ్లలో కొత్తగా మంజూరైన కార్డులు 1.21 లక్షలే..
- రేషన్ కార్డులేని కుటుంబాల పరిస్థితి అధోగతేనా?
- ఈ నెల 28 నుంచి సంక్షేమ పథకాలకు దరఖాస్తుల స్వీకరణ
- ఆందోళనకు గురవుతున్న పేదలు



సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ ప్రభుత్వం అభయ హస్తం (ఆరు గ్యారంటీ) పథకాల అర్హతకు తెల్లరేషన్ (ఆహార భద్రత) కార్డు ప్రామాణికం కానుంది. దారిద్ర్య రేఖకు దిగువనున్న (బీపీఎల్) కుటుంబం గుర్తింపు కార్డుగా రేషన్ కార్డు పని చేయనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద కుటుంబాల కోసం అమలు తలపెట్టనున్న ఆరు గ్యారంటీ పథకాలైన మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత పథకాల్లో మహానగరానికి రైతు భరోసా మినహా మిగతా ఐదు పథకాలు వర్తించనున్నాయి. ఈ నెల 28 నుంచి ప్రజాపాలనలో భాగంగా వార్డుల వారీగా ఐదు పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు రంగం సిద్ధమవుతోంది. సమగ్ర కుటుంబ సర్వే తరహాలోనే స్వీకరించే దరఖాస్తుల్లో కుటుంబ పూర్తి వివరాలను తీసుకోనున్నారు. కుటుంబానికి సంబంధించి ఇళ్లు, ఆదాయం, గ్యాస్ కనెక్షన్, వాహనాలు, రేషన్ కార్డు, ఉద్యోగం ఇతరత్రా అన్ని వివరాలను దరఖాస్తులో స్వీకరిస్తారు. ఈ దరఖాస్తుల ఆధారంగానే గ్యారంటీ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక జరగనుంది. దరఖాస్తుల వెంట తప్పనిసరిగా రేషన్ కార్డు, ఆధార్ కార్డులను జత చేయాల్సి ఉంటుంది. రెండింటిలో ఏది లేకున్నా ఆదిలోనే దరఖాస్తులను తిరస్కరించనున్నారు. దీంతో పదేళ్ల పాటు కేవలం బియ్యం కార్డుగా పని చేసిన రేషన్ కార్డు బహుళ ప్రయోజనకారిగా మారి మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

వడపోసి.. ఏరివేసి..

గ్రేటర్‌లోని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా , మేడ్చల్ జిల్లా పరిధిలో ప్రస్తుతం మొత్తం రేషన్ కార్డులు 17,21,994 ఉన్నాయి. ఇందులో గత పదేళ్లలో కొత్తగా మంజూరైన కార్డులు 1.21 లక్షలు మాత్రమే. వాస్తవానికి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తెల్లరేషన్ కార్డులను ఆహార భద్రత కార్డులుగా మార్పు చేయడంతోపాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఇబ్బడిముబ్బడిగా కొత్త కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. కొంత కాలానికి అనర్హుల పేరిట కొన్ని కార్డులను ఏరి వేసి 15,99,639కి పరిమితం చేసింది. దీంతో తిరిగి కొత్త కార్డుల కోసం పెద్ద ఎత్తున సుమారు 3.40 లక్షల కుటుంబాలు దరఖాస్తులు చేసుకోగా మూడేళ్ల క్రితం 360 డిగ్రీల స్థాయిలో వడపోసి కేవలం 1.21 లక్షల దరఖాస్తులను మాత్రమే ఆమోదించి కొత్త కార్డులు మంజూరు మంజూరు చేసింది.

వైఎస్ హయంలోనే 16.98 లక్షల కార్డులు

తెలంగాణ ఆవిర్భావానికి ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర రెడ్డి అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత పెద్ద ఎత్తున నిరు పేదలందరికీ తెల్లరేషన్ కార్డుల భాగ్యం కలిగింది. అప్పట్లో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొత్తం మీద తెల్ల రేషన్ కార్డుల సంఖ్య 16,98,982లకు చేరింది. అప్పట్లో చౌకధరల దుకాణాల ద్వారా అమ్మహస్తం పథకం కింద రూ.185కే తొమ్మిది రకాల నిత్యావసర సరుకులు రూ.1 కిలో బియ్యంతోపాటు కందిపప్పు, చింతపండు, గోధుమలు, గోధుమ పిండి, కారంపొడి, నూనె తదితర సరుకులు పంపిణీ జరిగేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం తెల్లరేషన్ కార్డు ఆహార భద్రత కార్డుగా మారి కేవలం బియ్యానికే పరిమితమైంది.

ఎదురుచూపుల్లో 10 లక్షల కుటుంబాలు..

మహానగరంలో మరో 10 లక్షల కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నాయి. సుమారు కోటిన్నర జనాభా కలిగిన నగరంలో సుమారు 40 లక్షల కుటుంబాలు ఉండగా అందులో దారిద్ర్య రేఖకు దిగువ నున్న కుటుంబాలు 27.21 లక్షల వరకు ఉండవచ్చని అంచనా. ప్రస్తుతం 17.21 లక్షల కుటుంబాలు మాత్రమే తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీ సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు ప్రామాణికంగా ప్రకటించడంతో తెల్ల రేషన్ కార్డుకు మరింత డిమాండ్ పెరిగింది. కొత్త తెల్ల రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తే భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. గ్యారంటీ సంక్షేమ పథకాలకు దరఖాస్తులు స్వీకరించనున్నడంతో రేషన్ కార్డులు లేని కుటుంబాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

గ్యారంటీ పథకాలివే ..

కాంగ్రెస్ గ్యారంటీ పథకాల కోసం వార్డుల వారీగా ఈ నెల 28 నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం దారిద్ర్యరేఖకు దిగువనున్న పేద కుటుంబాలకు మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతి నెలా రూ. 2,500 సాయం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ. 500కే వంట గ్యాస్ సిలిండర్ వర్తించనుంది. గృహ జ్యోతి కింద ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వర్తించనుంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇంటి స్థలం, నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం, ఉద్యమకారుల కుటుంబాలకు 250 చ.గ. స్థలం అందిస్తారు. యువ వికాసం పథకం కింద విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డు. ప్రతీ మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తారు. చేయూత పథకం కింద వృద్ధులు, వితంతువులకు నిరుపేదలకు సామాజిక పెన్షన్ నెలకు రూ.4,000 చొప్పున అందిస్తారు. వారికి రూ. 10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా వర్తించనుంది.

రోడ్డు నిర్మాణ పనుల్లో వివాదం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్ నుంచి తొర్రూర్‌కు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులను సోమవారం అధికారులు చేపడుతుండగా మరోసారి వివాదానికి దారితీసింది. బొక్క గోపాల్ రెడ్డి తన వ్యవసాయ పొలంలో నుంచి కాకుండా నక్షబాట నుంచి రోడ్డును వేయాలని కోరారు. అధికారులు పనులు చేపట్టడానికి ఏర్పాట్లు చేస్తుండగా, రైతులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ గొడవ జరిగింది. పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు, రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని సర్ది చేప్పే ప్రయత్నం చేసినా ఎవరూ వెనక్కి తగ్గకపోవడంతో, మరోసారి నక్షబాటను సర్వే చేసి గుర్తిస్తామని అధికారులు తెలిపారు. ఈ రోడ్డు పనుల వివాదం కొన్నేళ్లుగా కొనసాగుతున్న విషయం అందరికీ తెలిసిందే. ప్రస్తుతం వివాదం ముగిసి రోడ్డు పూర్తవుతుందని అనుకున్న వారికి నిరాశే ఎదురయింది. రోడ్డు పనులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


రోడ్డు నిర్మాణ పనుల వద్ద వాగ్వాదం

అయ్యప్ప ఆలయంలో లక్ష పుష్పార్చన


లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని బాలమణికంఠ అయ్యప్ప స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండో రోజూ సోమవారం ఉదయం శబరిమల సన్నిదాన సహాయ అర్చకులు బ్రహ్మశ్రీ ఉన్నికృష్ణన్ నంబూద్రీ, యు.ఆర్.ప్రసాద్ గురుస్వామి, ఆలయ ధర్మకర్త మద్ది జగదీశ్వర్ రెడ్డిల పర్యవేక్షణలో ఉ.6 గంటలకు గణపతి హోమం నిర్వహించి లక్ష పుష్పార్చన చేశారు. సాయంత్రం స్వామివారిని ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి మృతి

మంచాల: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంచాల మండలంలోని చిదేడ్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. మంచాల ఎస్సై రవినాయక్ వివరాల ప్రకారం.. చీదేడ్‌కు చెందిన సన్నాయిల రమేష్(35) కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కుక్కను తప్పించబోయి.. యువకుడి దుర్మరణం

పహాడీషరీఫ్: అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించబోయి స్కూటీపై నుంచి కిందపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ సీ.హెచ్.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడకు చెందిన కర్నాటి దీపక్‌కుమార్ నేత (29) మామిడిపల్లిలోని అత్తగారింటికి వచ్చాడు. ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో తన స్కూటీపై ఉప్పుగూడకు వెళ్లే క్రమంలో పహాడీషరీఫ్‌లోని అల్-అద్రూస్ పాఠశాల వద్దకు రాగానే కుక్క అడ్డు రావడంతో సడెన్‌గా బ్రేక్ వేయడంతో కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి బామ్మర్ది వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రేమ, త్యాగం క్రీస్తుమార్గం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రేమ, త్యాగం ఏసుక్రీస్తు సూచించిన మార్గమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. పట్టణంలో ఆయా చర్చిల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఉదయం నుంచి క్రైస్తవులు చర్చిలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తిగీతాలను ఆలపించి, ఏసుక్రీస్తు సూక్తులను వినిపించారు. ఈ సందర్భంగా పట్టణంలోని క్రిస్టియన్ కాలనీలోని జియాన్ యంబీ చర్చి, బైపాస్‌లో ఉన్న ఎఫ్‌సీఎస్ హోం చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏసు ప్రభువు ప్రజలకు ప్రేమాభిమానాలను పంచారన్నారు. ఏసుక్రీస్తు జీవితం క్షమాగుణానికి, ప్రేమ, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని అన్నారు. క్రీస్తు సూచించిన మార్గంలో అందరు నడవాలని, సమాజాభివృద్ధికి అందరు పాటుపడాలని సూచించారు. కార్యక్రమాల్లో నాయకులు బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, బస్వం, బాల్‌రాజ్‌గౌడ్, మోహన్, ఖదీర్ పాల్గొన్నారు.


చర్చిలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

వ్యక్తిపై దాడి

మాడ్గుల: ఓ వ్యక్తిపై దాడి జరిగిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామానికి చెందిన క్రాంతికుమార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్‌గా రెండేళ్లు పని చేసి ఇటీవల మేడ్చల్ జిల్లాకు బదిలీ అయ్యారు. కంప్యూటర్ ఆపరేటర్ క్రాంతికుమార్ రంగారెడ్డి జిల్లాలో పనిచేసినప్పుడు ఉన్నతాధికారులతో కుమ్మక్కై కోట్లాది రూపాయలు సంపాధించాడని గ్రామానికి చెందిన వెంకటయ్య ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు చేసిన వెంకటయ్యపై క్రాంతికుమార్ దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు మాడ్గుల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా, ఇరువురు బంధువులని పోలీసులు వివరించారు. వెంకటయ్య తనపై దాడి చేశారని ఆపరేటర్ క్రాంతి కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


గాయపడ్డ వెంకటయ్య

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు రాందాస్ నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎర్రగోవింద్ తండా పంచాయతీ పరిధిదలోని గురులోకమసంద్ ప్రభు ఆలయ వార్షికోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ..ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతోందన్నారు. కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఆంజనేయులు, వెంకటయ్య,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గంధం చెట్ల నరికివేత

యాచారం: గడ్డమల్లయ్యగూడ గ్రామంలోని వ్యవసాయ పొలాల్లో రైతులు పెంచుతున్న గంధం చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి ఎత్తుకెళ్లారు. గ్రామంలోని గుండ్లపల్లి సురేందర్‌రెడ్డి వ్యవసాయ పొలంలో ఏడు చెట్లు, గుండ్లపల్లి అంజిరెడ్డికి చెందిన ఒక చెట్టు, అచ్చెన పర్వతాలు పొలంలో ఒక చెట్టు, గుండ్లపల్లి కమలాకర్‌రెడ్డికి చెందిన ఒక చెట్టును ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నరికి ఎత్తుకెళ్లారు. 12 ఏళ్ల వయస్సున్నా, సుమారు రూ. 15 లక్షల విలువ చేసే గంధం చెట్లను ఎత్తుకెళ్లడంపై రైతులు సోమవారం యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పొలాల రక్షణకు బిగించిన రూ.లక్షన్నరకు పైగా పెన్సింగ్‌ను కూడా తొలగించారు. పొలాలు గునుగల్ అటవీ ప్రాంతం సమీపంలో ఉండడంతో నరికివేతకు సులభంగా మారింది. రెండు రోజుల కింద చౌదర్‌పల్లి గ్రామంలో ఓ రైతు వ్యవసాయ పొలంలో పెంచుతున్న 20 గంధం చెట్లను కూడా నరికి తీసుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదయ్య తెలిపారు.


గడ్డమల్లయ్యగూడలో నరికిన గంధం చెట్టు

పొగమంచుతో పరేషాన్


పొగమంచు కారణంగా లైట్లు వేసుకుని వెళ్తున్న కారు

యాచారం: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం దట్టమైన పొగమంచు కురిసింది. ఉ.9 గంటల వరకు కూడా పొగమంచు కమ్ముకొని ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాగార్జున సాగర్-హైదరాబాద్ రహదారిపై పొగమంచు కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. యాచారం- నక్కర్తమేడిపల్లి, యాచారం-కందుకూర్ రోడ్డు, మాల్-మంతన్‌గౌరెల్లి రోడ్లల్లో ఉ. 9 గంటల వరకు వాహనదారులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాగర్ హైవేపై లైట్లు వేసుకుని వాహనాలను నడపాల్సిన పరిస్థితి వచ్చింది.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

షాబాద్: అతిగా మద్యం సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి వివరాల ప్రకారం... షాబాద్ మండలంలోని మాచన్‌పల్లి గ్రామానికి చెందిన బైండ్ల యాదయ్య(35) శనివారం రాత్రి అతిగా మద్యం సేవించి పడిపోయాడు. ఇంటికి రాకపోవడంతో చుట్టూ పక్కల వెతకగా మద్యం సేవించి పడిపోవడాన్ని గమనించారు. అపస్మాకర స్థితిలో ఉండడంతో చికిత్స నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. భార్య మనీలా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


యాదయ్య మృతదేహం

కాలువలో పడి వ్యక్తి దుర్మరణం

షాబాద్: ఫిట్స్ వ్యాధి కారణంగా ఓ వ్యక్తి కాలువలో పడి మృతి చెందిన ఘటన షాబాద్‌లో చోటు చేసుకుంది. షాబాద్ ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. షాబాద్‌కు చెందిన పిట్టల రమేష్(40) శనివారం ఉ.11:30 గంటలకు అడవి కాకరకాయలు తీసుకువస్తానని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టూ పక్కల వారి సహాయంతో వెతకగా కాలువలో పడిపోయి ఉండడం గమనించారు. అతనికి ఫిట్స్‌వ్యాధి ఉందని, ఫిట్స్ రావడంతో కాలువలో పడి మృతి చెంది ఉండొచ్చని కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


రమేష్ మృతదేహం

వరుస సెలవులు.. ఓటీపీ కొర్రీలు

ఆందోళనలో పత్తి రైతులు

మోమిన్‌పేట: మార్కెట్‌కు వరుస సెలవులు రావడంతో పత్తి రైతు ఆందోళనకు గురవుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో పత్తి డిమాండ్ తగ్గడంతో దళారులు మద్దతు ధరకు రూ.500 తక్కువ చేసి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు సీసీఐకే పత్తి అమ్మేందుకు మొగ్గు చూపుతున్నారు. స్థానిక అయ్యప్ప కాటన్ మిల్లులో ప్రభుత్వం రూ.7020 మద్దతు ధరతో కొనుగోలు చేస్తుంది. సీసీఐలోనూ ఒక్కోరైతు వద్ద ఎకరాకు 12 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో వానాకాలంలో నమోదైన పంటలకు అనుగుణంగా పత్తి కొనుగోలు చేస్తున్నారు. రైతుల ఆధార్ నంబరును ఎంట్రీ చేస్తే ఓటీపీ వస్తుంది. అలా వచ్చిన రైతుల నుంచే పత్తిని కొనుగోలు చేస్తున్నారు. కావున రైతులు ఆధార్, బ్యాంకు పాసు పుస్తకం నంబరు, పట్టాదారు పాసు పుస్తకం నంబరు తప్పనిసరిగా ఫోన్ నంబరుకు అనుసంధానమై ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఖరీఫ్‌లో పంటల నమోదు సమయంలో పత్తిని ఎన్ని ఎకరాలలో సాగు చేశామో ఏఈఓల వద్ద నమోదు చేయించుకొంటేనే ప్రస్తుతం అమ్ముకొనేందుకు వీలు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో పంటల నమోదు చేసుకోకుంటే ఉన్నతాధికారులు ఆర్‌ఐ, ఏఈఓ వద్ద రాయించుకొచ్చినా సరిపోతుందని సూచించినా రైతులకు మాత్రం అమ్ముకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందుగా నమోదు చేసుకొంటేనే అమ్ముకొనేందుకు అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ఎటువంటి కొర్రీలు లేకుండా సీసీఐ వారు పత్తి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రాణం తీసిన పొగమంచు

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం
- అయ్యప్ప మాలధారుడి దుర్మరణం

నందిగామ: పొగమంచు ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. తెల్లవారు జామున ద్విచక్ర వాహనంపై స్నానానికి వెళ్తున్న ఓ అయ్యప్ప మాలధారుడిని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని చాకలిగుట్ట తండా సమీపంలో జేపీ దర్గా రోడ్డులో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా.. చాకలిగుట్ట తండా గ్రామ పంచాయతీ పరిధిలోని తాటిగడ్డ తండాకు చెందిన జటావత్ సురేందర్‌నాయక్(40) ఇటీవల అయ్యప్ప మాలధరించాడు. గ్రామ సమీపంలోని ఓ దేవాలయ ఆవరణలో సన్నిదానం ఏర్పాటు చేసుకొని పూజలు చేసుకుంటూ తోటి అయ్యప్ప మాలధారులతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున స్నానం చేసేందుకు దర్గా రోడ్డులోని ఇంటికి తన ద్విచక్ర వాహనం (స్కూటీ)పై వెళ్తున్నాడు. అప్పటికే దట్టమైన పొగమంచు కమ్ముకొని ఉంది. వాహనాలు ఏ మాత్రం కనిపించలేని పరిస్థితి. స్కూటీపై వెళ్తున్న సురేందర్‌నాయక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ద్విచక్రవాహనం రోడ్డు పక్కన పడిపోగా సురేందర్ నాయక్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన కుటుంబ సభ్యులు, తండావాసులు, తోటి అయ్యప్ప మాలధారులు, ఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరైయ్యారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. మృతుడి భార్య సుమిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాలకృష్ణ తెలిపారు. సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నట్లు త్వరలోనే వాహనాన్ని గుర్తించనున్నట్లు వివరించారు.


మృతుడు సురేందర్‌నాయక్ (ఫైల్)

మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన కారు


మృతదేహంతో రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న స్థానికులు, కుటుంబ సభ్యులు

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు
- బాధితులకు న్యాయం చేయాలంటూ మృతదేహంతో రాస్తారోకో

కొందుర్గు: మోటార్ సైకిల్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లేడ్ చౌదరిగూడ మండలం చౌదరిగూడ గ్రామానికి చెందిన చంద్రశేఖర్, క్రాంతికుమార్ మోటార్ సైకిల్‌పై షాద్‌నగర్ నుంచి చౌదరిగూడకు వెళ్తుండగా శ్రీరంగాపూర్ సబ్‌స్టేషన్ వద్ద ఎదురుగా వస్తున్న కారు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో చంద్రశేఖర్, క్రాంతికుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు చికిత్స కోసం షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చంద్రశేఖర్ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య పూజితతో పాటు మూడు నెలల పాప ఉంది. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.


మృతుడు చంద్రశేఖర్‌తో భార్య పిల్లలు(ఫైల్)

స్థానికులు, కుటుంబ సభ్యుల ఆందోళన

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు, కుటుంబ సభ్యులు సోమవారం మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి రాస్తారోకో చేశారు. దాదాపు అరగంట పాటు రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. షాద్‌నగర్ రూరల్ సీఐ లక్ష్మీరెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించారు. కారు కొత్తూర్‌కు చెందిన నర్సింలుకు సంబంధించినదని విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

వాజ్‌పేయి ఆదర్శప్రాయుడు


వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బాషా తదితరులు

బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బాషా

యాచారం: మాజీ ప్రధాని వాజ్‌పేయి ఆదర్శప్రాయుడని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా అన్నారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాజ్‌పేయి కృషి ఫలితంగానే నేడు దేశంలో బీజేపీ ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. ఆయన కృషితోనే ప్రపంచంలోనే భారతదేశం ఎంతో పేరు ప్రఖ్యాతులు సాధించిందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు శ్రీధర్‌గౌడ్, నరేందర్‌గౌడ్, శ్రీనువాస్‌గుప్త, కృష్ణ, రాజు, గణేష్‌నాయక్, పాండురెడ్డి, శ్రీనువాస్, శెట్టిపల్లి శివ, కర్నాటి నరేష్ పాల్గొన్నారు.